ఉపాధి కూలీల సంక్షేమమే లక్ష్యం

- పని ప్రదేశంలో ప్రత్యేక ఏర్పాట్లు
- ఎండ నుంచి ఉపశమనానికి టెంట్లు
- అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- ప్రథమ చికిత్సకు మందులు, ట్యాబ్లెట్లు


గుమ్మడిదూర్రులో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పెనుగంచిప్రోలు: ఈఏడాది ప్రారంభ దశలోనే ఎండలు మండిపోతున్నాయి. గత వేసవి అనుభవాలను గుర్తుంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు ప్రభుత్వం పని ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచారు. పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు టెంట్, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచుతున్నారు.

నియోజకవర్గంలో కూలీలు..

నియోజకవర్గంలో ప్రస్తుతం జగ్గయ్యపేట మండలంలో 17,168 మంది జాబ్ కార్డుదారులు ఉండగా 7,200 మంది పనులు చేస్తున్నారు. పెనుగంచిప్రోలు మండలంలో 10,607 జాబ్ కార్డుదారులకు 6 వేల మంది, వత్సవాయి మండలంలో 14,196 జాబ్ కార్డు దారులకు గాను 6,500 మంది పనులకు వస్తున్నారు. వేసవి ఎండ తీవ్రతకు కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు, విరోచనాలు, నొప్పులు, జలుబు, గ్యాస్ తదితర జబ్బులు రాకుండా ట్యాబ్లెట్లు అందుబాటులో ఉంచారు.

కూలీలకు సిద్ధంగా ఉంచిన ఒక్కో కిట్‌లో..

ఓఆర్ఎస్ ప్యాకెట్స్	-100
పారాసెటమాల్ ట్యాబ్లెట్స్	-50
ఫ్యూరోజోల్డిన్ టాబ్లెట్స్	-10
సిట్రజిన్ టాబ్లెట్స్	-10
రాంటాక్ లేదా ప్యాంటాప్ టాబ్లెట్స్	-50
సిప్రాన్ లేదా ఏమోక్షిలిన్ టాబ్లెట్స్	-50
అండోనాశోట్రోన్ టాబ్లెట్స్	-50
బీ కాంప్లెక్స్ టాబ్లెట్స్	-50
డైక్లోఫినాక్ టాబ్లెట్స్	-50

సౌకర్యాలు బాగున్నాయి..



ఉపాధి హామీ పనుల్లో భాగంగా కాలువ పూడిక తీత, డొంకరోడ్లు పనులు చేస్తున్నాం. పని ప్రదేశంలో నీడ సదుపాయం కల్పించారు. స్వచ్ఛమైన నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేశారు. ఈవేసవి తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్స్, అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ సేవలు బాగున్నాయి.

–రేగండ్ల శ్రీనివాసరావు,ఉపాధి కూలీ

ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు



ప్రభుత్వం ఎంతో ముందు జాగ్రత్తగా కూలీల రక్షణ కోసం పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు కూడా సిద్ధంగా ఉంచారు. గ్రామాల వారీగా ఉపాధి హామీ పథకం సిబ్బందికి కిట్స్ అందజేశారు. కూలీలు ఎండలకు జాగ్రత్తగా ఉంటూ, స్వచ్ఛమైన తాగునీరు తీసుకోవాలి.

–పూట్ల నాగమణి, జెడ్పీటీసీ, పెనుగంచిప్రోలు

పని ప్రదేశంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..



ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు అన్ని వసతులు కల్పించాం. ప్రస్తుతం డొంక రోడ్లు, పంట పొలాల్లో పూడిక తీత పనులు, ఉద్యాన పంటలకు అవసరమైన పనులు చేయిస్తున్నాం. కూలీలకు ఒకొక్కరికి సరాసరి రోజుకు రూ.260 నుంచి రూ.265 వేతనం అందుతోంది. పని కావాలనుకునేవారు మండల పరిషత్ కార్యాలయం లేదా గ్రామ పంచాయతీల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు. అందరికీ పని కల్పిస్తున్నాం.

–తిరుపతయ్య, ఏపీఓ, ఉపాధిహామీ పథకం, పెనుగంచిప్రోలు మండలం

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మక్కపేట(వత్సవాయి) : గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవోఎస్వీ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. మక్కపేట సచివాయం ఎదురుగా పాదాచారుల కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండలు తగ్గేవరకు ప్రత్యేకంగా మనిషిని కేటాయించి తాగునీటిని పోయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొమరగిరి సంక్రాంత్, వీఆర్వో జి.స్వామి సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కళ్యాణ్

కంచికచర్ల : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని, కార్మికులు తమ హక్కులకోసం పోరాడిన రోజే మే డే అని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ అన్నారు. స్థానిక సీఐటీయూ అనుబంధ సంఘ కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాలన్నీ పోరాటం చేసి రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. రైతుల సమస్యలు పట్టించుకోని ప్రధాని నరేంద్రమోడీని ఇప్పటికే ప్రజలు చీదరించుకుంటున్నారని ఆరోపించారు. రానున్న మేడే ఉత్సవాల్లో కార్మిక సంఘాలన్నీ కలసికట్టుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి బెజ్జం భూషణం, బుజ్జి, దావలా, వీరయ్య, వెంకటరత్నం, శివ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



నందిగామ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని ఒకటో వార్డులో మంగళవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. డ్రెయిన్లలో పూడిక తీతలు, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా సహకరిస్తే పట్టణాన్ని స్వచ్ఛ నందిగామగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పాకాల పాటి కిరణ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు సర్పంచులు, ఎంపీటీ సభ్యుల సమావేశం

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు బుధవారం సమావేశం జరుగుతుందని ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు నిత్యం సరఫరా అయ్యేలా చూడాలని, శానిటేషన్ పనులు చేపట్టేందుకు తగిన చర్యలపై చర్చించాల్సి ఉందన్నారు. ఈ సమావేశం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని ఈఓపీఆర్డీ తెలిపారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

నందిగామ: నూతనంగా ఎన్నికైన నందిగామ బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు, కార్యదర్శి పి.ప్రకాష్, బి.భాస్కరరావు ,షేక్ ఆజాద్, నంద్రు బాబు, విద్యాసాగర్ ఉన్నారు.

అకాల వర్షం..



పెనుగంచిప్రోలు: అకాల వర్షం, భారీ గాలి, దుమ్ము మామిడి రైతులకు తీరని వేదన మిగిల్చింది. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, గాలిదుమ్ముతో రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్నను కాపాడుకోవటానికి పరదా పట్టాలతో పొలాలకు పరుగులు తీశారు. పట్టాలు కప్పుతున్నా గాలిదుమ్ముకు అవి లేచి పోతుండటంతో రైతులు పడరాని పాట్లు పడ్డారు. కోతలకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలు నేలరాలాయి. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మునేరు పక్కన వందల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. మామిడి చెట్లు కూడా నేలకొరిగాయి. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగాయి.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- అల్లూరులో గడప గడపకు మన ప్రభుత్వం


అల్లూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అల్లూరు(వీరులపాడు): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజల ఇళ్ల ముంగిటకు పాలన తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి చెప్పాడంటే చేస్తాడంతే అనేంత పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాల హయాంలో చూడనంత అభివృద్ధిని నాలుగేళ్ల పాలనలో చేసి చూపించారని తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రజల వద్దకు రావటం గర్వంగా ఉందని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వానికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఏఎంసీ చైర్ పర్సన్ కోటేరు మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్ల పూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం , సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, నాయకులు కుంపటి శ్రీను, రాజగోపాల్ రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసరబాదలో..

నందిగామ టౌన్: చందర్లపాడు మండలంలోని కాసరబాద గ్రామంలో మంగళవారం రాత్రి శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బుక్‌లెట్లు అందజేసి, సంక్షేమ పథకాలు వివరించారు. సర్పంచ్ హనిమిరెడ్డి, నాయకులు చల్లా శివయ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

వీరులపాడు ఎస్ఐగా మహాలక్ష్మణుడు



వీరులపాడు: వీరులపాడు ఎస్ఐగా పని చేస్తున్న సోమేశ్వరరావును ఉన్నతాధికారులు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ మాచవరం ఎస్ఐగా పని చేస్తున్న మహాలక్ష్మణుడు వీరులపాడు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టనున్నారు.

పిడుగుపాటుకు తాటిచెట్టు దగ్ధం



నందిగామ: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓ తాటి చెట్టుపై మంగళవారం సాయంత్రం పిడుగు పడింది. పిడుగుపాటుకు చెట్టు పూర్తిగా కాలిపోయింది. అప్పటివరకు పిడుగు పడ్డ సమీపంలోనే గ్రామానికి చెందిన పలువురు మిరపకాయల కల్లాల వద్ద ఉన్నారు. ఆర బెట్టిన ఎండుమిర్చిపై పట్టలు కప్పి రైతులు ఆ ప్రాంతం నుంచి బయలుదేరి కొద్దీ దూరం వెళ్లగానే ఈ సంఘటన జరిగింది. విషయం తెలుసుకుని రైతులు, కూలీలు ఆందోళనకు గురయ్యారు.

'అంగన్‌వాడీ' అభ్యర్థులకు ఇంటర్వ్యూలు



నందిగామ: డివిజన్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఆర్డీఓ రవీంద్రరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవి, పలు శాఖలకు చెందిన అధికారుల సమక్షంలో అభ్యర్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్‌లో 1 కార్యకర్త పోస్టుకు ఇద్దరు, 13 సహాయకురాళ్ల పోస్టులకు 46 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిని ఇంటర్వ్యూ చేశామని తెలిపారు.

ప్రజారోగ్యానికి దోమలే ప్రధాన శత్రువులు


గోళ్ళమూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది


మలేరియా అవగాహన ర్యాలీలో డాక్టర్ సుష్మాప్రియదర్శిని, వైద్యసిబ్బంది

ప్రపంచ మలేరియా దినోత్సవం

వత్సవాయి : ప్రజారోగ్యానికి దోమలే ప్రధాన శత్రువులని, దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలని వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని సూచించారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వత్సవాయిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల మలేరియా వస్తుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకోవడంతోపాటు మలవిసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. నివాసప్రాంతాల్లో ఖాళీ కొబ్బరి బొండాలు, మురుగునీటి గుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఎస్ మాణిక్యం హెల్త్‌సూపర్‌వైజర్లు జవహర్‌లాల్, ఉషారాణి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొణకంచి ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి వైద్యాధికారులు ఇందిర, సుజన, వాణి మలేరియా జ్వరం లక్షణాలు, వ్యాధి వ్యాపించే విధానం, దోమలు కుట్టకుండా, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎండ వీత్రవతకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


కొణకంచి ర్యాలీలో వైద్యాధికారులు ఇందిర, వాణి

నందిగామ: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. గోళ్ళమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు రవి మాట్లాడుతూ మలేరియా వ్యాపించకుండా ఉండాలంటే ప్రాథమికంగా దోమలను ఇంట్లోకి రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియాకు అన్ని ప్రభుత్వ వైద్యశాలలలో ఉచిత పరీక్షలతోపాటు వైద్య సేవలు పూర్తి ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. అప్రమత్తతోనే మలేరియాను అరికట్టవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరునక్షత్ర పూజలు

జగ్గయ్యపేట అర్బన్: భగవద్రామానుజాచార్యుల తిరునక్షత్రం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.శ్రీచంద్రమౌళీశ్వరస్వామి(పెద్ద శివాలయం), నెహ్రూచౌక్ వద్ద ఉన్న భగవద్రామానుజాచార్యులవిగ్రహాలకు పూజలు నిర్వహించారు. విజయవాడ రోడ్‌లోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో భగవద్రామానుజచార్యుల స్వామికి విశేష అభిషేకాల పూజా కార్యక్రమం అర్చకులు శ్రీరంగం శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు.

రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శిగా మల్లు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శిగా జగ్గయ్యపేటకు చెందిన షరాబు వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి కొంకిమళ్ల మల్లికార్జునరావు (మల్లు) నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ బంగారం, వెండి వ్యాపారులు, స్వర్ణకారులు పలువురు మల్లికార్జునరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం


జంగిల్ క్లియరెన్స్ పనుల ప్రారంభోత్సవంలో బాషా, ఎంపీడీవో, తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని కోదాడ రోడ్‌లో జిల్లా పరిషత్ స్థలంలో నూతనంగా షాదీఖానా నిర్మాణానికి కేటాయించిన స్థలం చదును చేసే పనులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు 70 సెంట్ల స్థలంలో జంగిల్ క్లియరెన్స్ పనులు షాదీఖానా కమిటీ చైర్మన్ షేక్ జానీబాషా ఆధ్వర్యంలో ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజున్నీసా ఫిరోజ్, ఎంపీడీవో జయచంద్ర, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రస్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పఠాన్ అక్బర్‌ఖాన్, ఈద్గా కమిటీ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్‌ఆలీ, దర్గా కమిటీ చైర్మన్ షేక్ ఖాజా, షాదీఖానా కమిటీ సభ్యులు రహంతుల్లా, ఆలీ, ఎండీఎం. సుభానీ, ఆర్టీసీ ఖాదర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- వ్యవసాయాధికారుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: అహర్నిశలు శ్రమిస్తున్న అన్నదాతల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనితర కృషి చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల వ్యవసాయాధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపుల ద్వారా రైతులకు 40 శాతం రాయితీపై ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తుందన్నారు. సీహెచ్‌సీలను రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులకు సీహెచ్‌సీల ద్వారా పలు గ్రామాల రైతులకు యంత్ర పరికరాలు అందించటం జరిగిందన్నారు.

అందుబాటులో పరిజ్ఞానం..

రైతులకు ప్రభుత్వం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని జగన్‌మోహనరావు తెలిపారు. డ్రోన్‌ల వినియోగానికి మండలానికి ముగ్గురి చొప్పున శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల వ్యవసాయాధికారులు, నాయకులు ఆవుల రమేష్‌బాబు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, కోటేరు ముత్తారెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, పొరుపల్లి హరిబాబు, పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తాడేపల్లి సభకు తరలిన నాయీబ్రాహ్మణులు


పేటలో ర్యాలీలో వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయీ బ్రాహ్మణులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నుంచి తాడేపల్లికి పెద్ద సంఖ్యలో నాయీ బ్రాహ్మణులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో మంగళవారం తరలి వెళ్లారు. నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలుకు 'థాంక్యూ సీఎం సార్' అంటూ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో నాయీ బ్రాహ్మణ కృతజ్ఞత సభా కార్యక్రమానికి వెళ్లారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా చిల్లకల్లు, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలలో ర్యాలీగా తరలి వెళ్లారు. నాయకులు దువ్వల రామకృష్ణ, కనిగిరి సుబ్బారావు, కామేపల్లి రోహిణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: దేవాలయ కల్యాణ కట్టల్లో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులకు పాలకవర్గాల్లో స్థానం కల్పించటంతో కృతజ్ఞతగా విజయవాడలో ఏర్పాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా ఏర్పాటు చేసిన సభకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ కల్యాణకట్టలో పనిచేయి నాయీ బ్రాహ్మణులు తరలి వెళ్లారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే తమకు న్యాయం చేశారన్నారు.

30 లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి


మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు దారా వినోద్‌బాబు

జగ్గయ్యపేట అర్బన్: విశ్రాంత ఉద్యోగులు ఈనెల 30వ తేదీ లోగా తమ లైఫ్ సర్టిఫికెట్లు, వేలిముద్రలు సబ్ ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జగ్గయ్యపేట బ్రాంచ్ అధ్యక్షుడు దారా వినోద్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ధరణికోట పెన్షనర్స్ భవన్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఫిబ్రవరి చివరి తేదీ లోగా విశ్రాంత ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్లు, వేలిముద్రలు ఎస్టీవో కార్యాలయంలో అందజేశారని, ఆ తరువాత అందజేసిన వారిలో 49 మంది ఉద్యోగుల ధ్రువీకరణ పత్రాలు తిరస్కరించారని తెలిపారు. తిరస్కరింపబడిన వారంతా మరలా ఈనెల చివరి తేదీలోగా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తే పెన్షన్ సజావుగా అందుతుందన్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడు ధరణికోట రమణ, కార్యదర్శి ఎస్ఏ ఘనీ, ప్రతినిధులు ముత్యాలరావు, మరియదాసు, జీవరత్నం, కోటేశ్వరరావు, దశరథ, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

నందిగామ: ఆదిశంకరాచార్య జయంతిని మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి ఆలయ ఈవో దూళిపాళ్ల సుబ్రహ్మణ్యం, వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీ రాఘవ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పలువురికి పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆదిశంకరాచార్య ఆలయంలో స్వామివారికి పలు రకాల విశేష పూజలు నిర్వహించారు.

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలో మంగళవారం జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద ఆలయ వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన గొప్పతనాన్ని భక్తులకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ. లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ


సచివాలయంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. మల్లేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని 1,11,12,13,14 సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 12వ సచివాలయంలో ముగ్గురు సెక్రటరీలు ప్రభుత్వం వారు ఆదేశించిన యూనిఫాం ధరించకుండా విధులకు హాజరైనందుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇతర ఏపీ సేవ సర్వీసెస్ ప్రగతిని పరిశీలించి ఆయుష్మాన్ భారత్, ఇటీవల ప్రవేశపెట్టి స్కిల్ డెవలప్‌మెంట్ రిజిస్ట్రేషన్‌లను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. వలంటీర్ల హాజరు పట్టికను పరిశీలించారు. నకాశిబజారు సచివాలయ పరిధిలో శానిటేషన్ కార్యదర్శితో పరిసర ప్రాంతాన్ని పరిశీలించి మురుగు కాలువలో తీసిన సిల్ట్‌ను వెంటనే తొలగించి, లైమ్ బ్లీచింగ్ చేయించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

ఉచిత శిక్షణకు స్పందన

నందిగామ: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్–2023) ఉచిత శిక్షణ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన కనిపిస్తోందని పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత కోచింగ్‌కు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం సాంకేతిక విద్యా మండలి ద్వారా అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30 లోగా పాలిసెట్‌కు కళాశాలలోని హెల్ప్ లైన్ సెంటర్ ద్వారా ఎటువంటి రుసుము లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.